International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-1, Jan-Mar-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# పాపినేని శివశంకర్ కొండచిలువ కథలు: రాజధాని రైతుసమస్యలు

**డా. పులపర్తి శ్రీనివాసరావు**

అతిథి అధ్యాపకులు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

**వ్యాస సంగ్రహం:**

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. సుమారు డెబ్బైశాతంమంది వ్యవసాయరంగం మీద ఆధారపడి బతుకుతున్నారు. ఇది దేశ జాతీయాదాయంపై వ్యవసాయ రాబడి అధిక ప్రభావాన్ని చూపుతోంది. అలాంటి సేద్యానికి, వ్యవసాయ భూమికి రైతే రాజు. ఇతను లేనిదే పంట లేదు. పంట లేనిదే ఆకలి తీరదు. ఆకలి తీరకుండా ఎవరూ జీవించలేరు. అందుకే రైతు దేశానికి వెన్నెముకగా మారాడు. 'జై కిసాన' అని కీర్తింపబడుతున్నాడు. కృషీవలుడని, నిత్య శ్రామికుడని పిలవబడుతూ సమాజానికి అన్నదాతగా మిగిలాడు. అలాగే ప్రపంచవ్యాప్తంగా మలేషియా, మారిషస్, బ్రెజిల్, చైనా లాంటి దేశాలు వ్యవసాయ ప్రోత్సాహక దేశాలు. ఆయా దేశాలలో రైతు పట్ల సానుకూల దృక్పథం ఉంది. రైతుకంటూ ఓ గౌరవం, చేయూత సమాజ, ప్రభుత్వ పరాలుగా లభిస్తున్నాయి. కానీ భారతదేశంలో పూర్వం ఉన్న స్థితి గతులేవీ నేడు వ్యవసాయరంగంలో కనిపించడం లేదు. అటు ప్రకృతి పెట్టే బాధని అతను భరిస్తూనే ఉన్నాడు. దాన్ని అతడు మార్చలేడు. పర్యావరణం అతనిపై కనికరాన్ని చూపదు. అతివృష్టి, అనావృష్టులకు అతని బతుకుపై సమ్మెటమోతను మోగిస్తున్నాయి. కరువు కాటకాలు అతని జీవనాన్ని తలక్రిందులు చేసాయి. అలాగే రైతుకి తమవంతు సహకారంగా అతని కష్టాన్ని గుర్తించమని, వారికి జరగుతున్న అన్యాయాలు, వారి కష్టాలను అతని తరపున విన్నవిస్తున్న సాహితీ మిత్రులు రైతు ఆవేదనలు అడుగడుగునా తెలుసుకున్న వారిగా వారి గళాలకు తమ కలాలకు పదునుపెడుతున్నారు. సమాకాలీన సమాజంలో రైతు సమస్యలు, కారణాలు, చైతన్యాన్ని వారి అభివద్ధిని కాంక్షిస్తూ రచనలను చేస్తున్నారు. ప్రత్యక్ష పరోక్షాలుగా వారి తరపున పోరాడటంలో కృతనిశ్చయులైనారు. ఇదే కోణంలో రైతుల పక్షాన నిలబడి, రైతుల కోసం కథలు రాసిన కథా రచయిత పాపినేని శివశంకర్. సమాజంలో సహాయం కోరే అమాయకులైన రైతు కష్టాలకు స్పందించి, రైతులకు న్యాయం జరగాలని, వారి ప్రాభవాలను దెబ్బతీసే పలు సమస్యలను ఆయా కథల్లో చర్చకు పెట్టారు రచయిత పాపినేని శివశంకర్. ముఖ్యంగా కొండచిలువ-1, కొండ చిలువ -2 అనే కథల్లో ఈ చర్చ బాగా కనబడింది. ఈ కథల్లో రాజధాని ప్రాంతంలో రైతలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. వారి బాధలను, సమస్యలను అనువణువు చిత్రించి కళ్ళ ముందు ఆవిష్కరించారు. ఈ కథలను పూర్తి స్థాయిలో విశ్లేషించేదే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

**ప్రవేశిక:**

2014 జూన్ 2 తరవాత ఆంధ్ర ప్రదేశ్ నుండి తెలంగాణా రాష్ట్రం విడిపోయిన తరువాత, తెలంగాణాకు అప్పటికే అభివృద్ధి చెందిన హైదరాబాద్ నగరం రాజధానిగా ఉంది. కానీ నవ్యాంధ్ర ప్రదేశ్ కి రాజధాని లేదు. ఈ తరుణంలో

అమరావతి ప్రాంతంలో కొన్ని వేల ఎకరాలు రైతులు వద్ద నుండి సేకరించి రాజధాని కోసం ప్రయత్నాలు చేశారు. అప్పటి ప్రభుత్వం సేకరించిన భూమి వల్ల రాజధాని నిర్మాణం అయితే జరగలేదు గాని, భూములిచ్చిన రైతులు మాత్రం అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. భూములు ధరలు పెరుగుతాయని ఊహించి రైతలకు భంగపాటే ఎదురైంది. తరువాత ప్రభుత్వం మారడం, అమరావతి రాజధానిని పక్కనపెట్టి, మూడు ప్రాంతాల అభివృద్ధి పేరుతో మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. దీంతో అమరావతిలో ఎక్కడి అభివృద్ధి అక్కడే ఆగిపోయింది. అభివృద్ధి సాధికార సంస్థను కూడా రద్దు చేయడంతో రైతులు ఏం చేయాలో తోచక ఆత్మహత్యలకు కూడా వెనకాడలేదు. ఇలాంటి తరుణంలో ఉద్యమం చేపట్టారు. పాదయాత్రలు చేపట్టారు. చివరకు ఇపుడు మళ్ళీ అమరావతి రాజధానిగా అంగీకరించడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన దగ్గర నుండి మొన్న 2024లో మరో ప్రభుత్వం ఏర్పడే వరకు మధ్యలో రైతులు అనుభవించిన సమస్యలను కథల రూపంలో శివశంకర్‌గారు యావత్ సమాజానికి అందించారు. వాటిని ఈ వ్యాసంలో పరిశీలించడమైంది.

**కవిపరిచయం:**

కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డా॥ పాపినేని శివశంకర్ గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం, నెక్కల్లు గ్రామంలో వెంకట కృష్టారావు, శాంతమ్మ దంపతులకు 1953, నవంబరు 6న జన్మించారు. వీరు నెక్కల్లులో ప్రాథమిక విద్యాభ్యాసం, తుళ్లూరులో గల కె.వి.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉన్నత పాఠశాలవిద్య ను పూర్తి చేశారు. పి.యు.సి.ని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో, గుంటూరుజిల్లాలోని జె.కె.సి. కళాశాలలో బి.ఏ. పూర్తి చేయడమే కాకుండా, ఆంధ్ర యూనివర్సిటీ నుండి గోల్డ్‌మెడల్ పొందారు. అలాగే నల్లపాడులోని ఆంధ్ర విశ్వవిద్యాలయశాఖలో 1974 నుండి 1976 మధ్య ఎం.ఏ. ను పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని పొందారు. 1989లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి "సాహిత్యం-మౌలిక భావనలు" అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేసి స్వర్ణ పతకాన్ని పొందారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన శాంతమ్మ, వెంకట కృష్ణారావుల దంపతులకు జన్మించిన శివశంకర్‌గారు గృహలక్ష్మిగారిని వివాహం చేసుకున్నారు. చదువు పూర్తి కాగానే 1977లో తాడికొండ బి.ఎస్.ఎస్.బి. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా ఉద్యోగ వృత్తిలోకి ప్రవేశించి, ప్రారంభంలో జూనియర్ కళాశాల అధ్యాపకునిగా జీవితాన్ని ఆరంభించి వీరు తరువాత ఉద్యోగోన్నతితో ప్రధాన అధ్యాపకునిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2010లో ఉద్యోగ విరమణ చేసి, ఇప్పుడు ఆయనకున్న సమయాన్ని సాహిత్య సృజనకు కేటాయిస్తూ సాహిత్య సేవ చేస్తున్నారు. 2016లో వీరు రాసిన 'రజనీగంధ' అనే కవితా సంపుటికిగాను కేంద్ర ప్రభుత్వం కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారాన్ని అందించింది. దీంతో వీరి భాషాసాహిత్య సేవ బాధ్యత మరింత పెరిగిందంటారు రచయిత.

**రాజధాని రైతు సమస్యలు:**

**1.కొండచిలువ-1:**

కథనాయకుడు వసంత్ అమరావతి ప్రాంత నివాసి. రాజధాని అమరావతి కాదని ప్రకటించిన తరువాత ఊరొదిలి వలస పోయిన చాలా కాలం తరవాత తన గ్రామానికి తిరిగి వచ్చినప్పుడు, పచ్చని పంటపొలాలు సిమెంట్ కాంక్రీట్ వనంగా మారిపోవడం చూసి తీవ్ర ఆవేదనచెందుతాడు. రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూసమీకరణ వల్ల గ్రామంలో పెద్ద మార్పులు చోటుచేసుకుంటాయి. వసంత్ తల్లి శారదమ్మ తనకున్న రెండు ఎకరాల పొలాన్ని ఇవ్వడానికి

మొదట ఇష్టపడకపోయినా, కొడుకు భవిష్యత్తు కోసం తరవాత అంగీకరిస్తుంది. అయితే, భూమిని 'స్వచ్ఛందంగా' ఇచ్చారని ప్రభుత్వం చెబుతున్నా, అది 'గొంతు మీద మెత్తగా కత్తి పెట్టి' తీసుకున్నట్లేనని వసంత్ బావమరిది సీను ఆవేదన వ్యక్తం చేస్తాడు. వ్యవసాయం ఆగిపోవడంతో సీను వంటి కౌలు రైతులు పని లేక ఇబ్బందులు పడుతుంటారు. అప్పులు చేసి కొన్న ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు ఇప్పుడు మూలకు పడి తుప్పు పడుతుంటాయి. భూముల ధరలు ఒక్కసారిగా కోట్లకు చేరడంతో, కుటుంబాల మధ్య ఆస్తి తగాదాలు మొదలవుతాయి. బంధాలు నశించి, మనుషుల మధ్య దూరం పెరుగుతుంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రవేశంతో రైతులు చేతికి వచ్చిన డబ్బును జూదం, తాగుడు వంటి వ్యసనాలకు ఖర్చు చేసి, చివరకు మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా అమ్ముకుని దారిద్ర్యంలోకి కూరుకుపోతుంటారు. అలాగే ఒకప్పుడు పచ్చని పంట పొలాలు, చెట్లు, పిట్టలతో కళకళలాడే గ్రామం ఇప్పుడు ఎడారిలా మారిపోతుంది. సాగు నిలిచిపోవడంతో పొలాలన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయి. నీటి బావులు ఎండిపోయి మంచినీటి కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక రోజు వసంత్ రాజధాని ప్రాంతంలోని కొండపైకి వెళ్లి చూసినప్పుడు, అశాస్త్రీయమైన అభివృద్ధి వల్ల జరుగుతున్న మార్పులు అతనికి ఒక భయంకరమైన కొండచిలువ కొండను చుట్టుముట్టినట్లుగా అనిపిస్తుంది. ఈ 'అభివృద్ధి' మనుషుల మనసులను ఇరుకున పెడుతోందని, పక్షులు, ప్రకృతిని దూరం చేస్తోందని, 'అభివృద్ధి అంటే పరిశ్రమలు, బ్రహ్మాండమైన భవనాలేనా?' అని వసంత్ తనలో తాను ప్రశ్నించుకోవడంతో కథ ముగుస్తుంది.

ఈ కథ రాజధాని నిర్మాణ ప్రక్రియలో భూములను కోల్పోయిన రైతుల వ్యధను, గ్రామీణ జీవనంలో వచ్చిన విధ్వంసకర మార్పులను ఆవిష్కరించింది. భూసేకరణ వల్ల కుటుంబాల మధ్య ఆస్తి తగాదాలు పెరగడమే కాకుండా, ప్రకృతితో మమేకమైన పాత జ్ఞాపకాలు, జీవవైవిధ్యం పూర్తిగా కనుమరుగయ్యాయని ఈ కథ వివరించింది. అభివృద్ధి పేరిట జరిగిన, జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం చేకూర్చాయే తప్ప, సామాన్య రైతులకు కన్నీటిని, అభద్రతా భావాన్ని మిగిల్చాయని ఈ రచన స్పష్టం చేస్తోంది. చివరికి, ఆధునిక భవనాల మధ్య మనిషి మానసిక ప్రశాంతతను కోల్పోయాడనే చేదు నిజాన్ని ఈ కథ కళ్లకు కట్టినట్లు నిరూపించింది.

ఈ అభివృద్ధి ఆర్థికంగా గొప్పగా అనిపించినా, అది రైతుల జీవితాలను, ప్రకృతితో వారికున్న అనుబంధాన్ని చిన్నాభిన్నం చేసింది. రాజధాని ప్రాంత భూసమీకరణ నేపథ్యంలో రైతుల జీవితాల్లో వచ్చిన విచ్ఛిన్నతను, వారి ఆవేదనను అత్యంత సహజంగా చిత్రించారు. దీనిలో భాగంగా రైతులు భూమి కోల్పోవడం ఒక సమస్య అయితే, అంతకుమించి జీవనధారం కోల్పోవడం మరో సమస్య. రైతులకు భూమి అంటే కేవలం ఆస్తి మాత్రమే కాదు, అది వారి ప్రాణవాయువు. భూ సమీకరణ పేరుతో ప్రభుత్వం రైతుల నుండి భూములను సేకరించడం వారి జీవన మూలాలను దెబ్బతీయడమే అవుతుందనే రచయిత ఉద్దేశ్యంగా అర్థమవుతుంది. ప్రభుత్వం ఈ భూసమీకరణ ప్రక్రియను 'స్వచ్ఛందంగా' చెప్పినప్పటికీ, అది రైతులకు 'కారణం లేకుండా గొంతు మీద మెత్తగా కత్తి పెట్టి' అడిగినట్లుగా అనిపించింది. భూమి పోవడంతో వ్యవసాయం ఆగిపోయింది, నాగళ్ళు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ పనిముట్లు మూలన పడి తుప్పు పడుతున్నాయి.

రాజధాని భూసమీకరణ వల్ల ఆర్థిక విధ్వంసం జరిగిందని, దాని వల్ల అనేక సమస్యలు పెరిగిపోయాయని ఈ కథలో ప్రస్తావించారు రచయిత. భూముల ధరలు కోట్లకు చేరడంతో రైతుల కళ్ళ ముందు 'బంగారు కలలు' ఆవిష్కరించబడ్డాయి. అయితే, చేతికి వచ్చిన డబ్బు రైతుల్లో స్థిరత్వాన్ని ఇవ్వడానికి బదులు జూదం, తాగుడు వంటి

వ్యసనాలకు దారితీసేలా చేసింది. రియల్ ఎస్టేట్ మాయాజాలంలో పడి, అక్షరాలు రాని అమాయక రైతులు తమ వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్మును కూడా పోగొట్టుకుని, చివరకు 'అటు వ్యవసాయం లేక, ఇటు చేతిలో డబ్బు లేక' దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అంతేకాకుండా, సామాజిక జీవనం కుంటుపడింది, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయి. పెరిగిన భూముల ధరలు గ్రామంలో మనుషుల మధ్య చిచ్చు పెట్టాయి. ఆస్తిలో వాటాల కోసం తోబుట్టువుల మధ్య తగాదాలు పెంచి మానవసంబంధాలను దెబ్బతీశాయి. సర్వే నంబర్ల చుట్టూ, సరిహద్దు రాళ్ళ చుట్టూ తిరుగుతూ కోర్టుల పాలవుతున్న రైతులు, పాత బంధాలను మరిచిపోయి శత్రువుల్లా మారిన సంఘటనలు పెరిగిపోయాయి. ఒకప్పుడు వానలు, పంటల గురించి మాట్లాడుకునే రైతులు ఈ పరిణామం తరువాత కోర్టు కేసులు, వివాదాల గురించి మాట్లాడుకుంటున్నారు అంటే రాజధాని భూసమీకరణ రైతుల జీవనంలో ఎంత విపరీత మార్పును తీసుకొచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ కథలో రాజధాని భూసమీకరణ పర్యవసానం పర్యావరణాన్ని దెబ్బతీసిందని, జీవనోపాధి కోల్పోయారనే చేదు నిజాన్ని కళ్ళముందుంచింది. వ్యవసాయం పోవడంతో కౌలు రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయారు. నిన్నటి వరకు భూమికి యజమానులుగా ఉన్నవారు నేడు నగరాల్లో సెక్యూరిటీ గార్డులుగా వలసలు పోయారు. మరికొందరు కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. పచ్చని పంట పొలాలు సమీకరణ తరువాత అటు పంట వేయకపోవడంతో, ఇటు రాజధాని పనులు జరగక పోవడంతో పిచ్చిమొక్కలతో నిండిన ఎడారిలా మారడాన్ని గుర్తుచేయడం గమనించదగ్గ విషయం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయడం వల్ల రైతుల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన గరీబు భూములు ఇప్పుడు సాగు లేక పార్థీనియం తో నిండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. కొండలను పిండి చేస్తూ భవనాలు నిర్మించడం వల్ల గాలిలో దుమ్ము పెరిగి పర్యావరణం కలుషితమైంది. ఇది పక్షులు, కీటకాలు, సహజ జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగించింది. ఈ సమస్యలే కాకుండా, నీటి బావులు ఎండిపోయి, కనీసం తాగడానికి కూడా మినరల్ వాటర్ క్యాన్ల మీద ఆధారపడాల్సి వస్తోందని జరిగిన పరిణామాలను వివరించే ప్రయత్నం చేయబడింది.

రాజధాని నిర్మాణం కోసం చేపట్టిన భూ సమీకరణ వల్ల రైతుల జీవితాల్లో తలెత్తిన సంక్షోభాన్ని, వారు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, మానసిక సమస్యలను విపులంగా చర్చించింది. దీని వల్ల వారసత్వ ఆస్తి పట్ల మమకారం పెరిగి, కుటుంబాల్లో తగాదాలకు దారితీసింది. ఈ కథలో తన భర్త చనిపోయినా సాటివారితో సమానంగా తల ఎత్తుకుని బతకడానికి శారదమ్మకు తన రెండు ఎకరాల పొలమే ఆధారమైంది. దానిని వదులుకోవాల్సి రావడం రైతులకు తీవ్ర మానసిక క్షోభను మిగిల్చింది. చిన్నప్పటి నుండి కలిసి ఆడుకున్న మిత్రులు సైతం ఆస్తి గొడవల వల్ల ఒకరికొకరు 'పెడమొహం' పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి చర్యలను ఖండించడాన్ని బట్టి రచయిత రైతుల పక్షపాతిగా అని చెప్పొచ్చు. రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను ఉద్ఘాటించి వారి మేలు కోరారని చెప్పొచ్చు.

ఈ కథ చివర్లో రచయిత నిజమైన అభివృద్ధి అంటే ఏంటి? అనే విషయాన్ని తన అభిప్రాయంగా చెప్పే ప్రయత్నం చేశారు. అభివృద్ధి అంటే కేవలం ఆకాశహర్మ్యాలు, పరిశ్రమలు, సిమెంటు రోడ్లు మాత్రమే కాదని, పచ్చని ప్రకృతిని, సారవంతమైన భూములను విధ్వంసం చేసి నిర్మించే భవనాలు మనుషులకు భౌతిక సౌకర్యాలను ఇవ్వగలవేమో కానీ, మానసిక ప్రశాంతతను, ప్రాణవాయువును ఇవ్వలేవని రచయిత హెచ్చరించారు. జీవితాలు బాగుపడే విధానాలు అమలు చేయడం, అందరికీ ఆమోదయోగ్యమైన జీవన ప్రమాణాలను పెంచడం అవసరమని, జీవన విధానంలో మార్పు రావాలని,

ధైర్యంగా బతకగలిగే ఆధారం కల్పించడమని, అదే నిజమైన అభివద్ధి అని సూచన ఈ కథలో చేయడం వ్యవస్థలను ఆలోచింపచేయడంగా భావించవచ్చు.

**2.కొండ చిలువ-2:**

ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు బదిలీ అయిన వసంత్, తన భార్య కుసుమ, చిన్న కుమారుడు రవితో కలిసి తన సొంత ఊరికి వస్తాడు. అమరావతి రాజధాని కోసం చేపట్టిన 'మహా పాదయాత్ర'లో పాల్గొనాలని, అలాగే ఒంటరిగా ఉంటున్న తన తల్లి శారదమ్మను పలకరించాలని అనుకుంటాడు. రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వడం, ప్రతిగా వారికి నివాస, వాణిజ్య ప్లాట్లు లభించినా, ప్రభుత్వం మారడం, మూడు రాజధానుల నిర్ణయం రావడంతో రాజధాని పనులు ఆగిపోయి, ఆ ప్రాంతమంతా కళావిహీనంగా తయారవుతుంది. ఒకరోజు వసంత్ తన బావమరిది శీనుతో కలిసి తమకు కేటాయించిన ప్లాట్లను చూడటానికి వెళ్తే, అక్కడ ప్లాట్ల జాడ కాకుండా అంతా ముళ్ళ పొదలతో నిండిపోయి ఒక శ్మశానంలా కనిపిస్తుంది. రాజధాని పనులు ఆగిపోవడంతో కూలీలకు పని లేకపోతుంది. అద్దెలు రాక ఇళ్లు ఖాళీ అవుతాయి. అదే రోజు వసంత్ తన బాల్యమిత్రుడు సూరిని కలుస్తాడు. రాజధాని రాకతో భూముల ధరలు పెరగగా, సూరి తన భూమిని అమ్మి, వచ్చిన డబ్బును జూదం, తాగుడుకు తగలేసి ఇప్పుడు కూలీగా మారతాడు. మరోవైపు మంగలి రంగారావు వంటి వారు భూమి ఇచ్చినా, ప్లాట్లు అమ్ముడుపోక, ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇబ్బందులు పడుతుంటారు. గ్రామంలో వృద్ధుడైన రామయ్య రెడ్డి, రాజధాని ప్రాంతం ముంపునకు గురవుతుందన్న ప్రభుత్వ వాదనలను కొట్టిపారేస్తూ, గత 80 ఏళ్లలో కృష్ణా నది ఇటువైపు రాలేదని చెబుతాడు. గతంలో పచ్చని పొలాలుగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు పిచ్చి మొక్కల అడవిలా మారి, ఆ కొండను మింగేస్తున్న కొండచిలువలా కనిపిస్తోందని వసంత్ అనుకుంటాడు.

న్యాయస్థానం అనుమతితో నవంబర్ 1, 2021న తుళ్ళూరు నుండి 'అమరావతి పరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమవుతుంది. వసంత్ కూడా ఈ యాత్రలో పాల్గొంటాడు. పోలీసులు అనేక ఆటంకాలు కలిగించినా, ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతారు. బహిరంగ సభలో వసంత్ మాట్లాడుతూ, రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాన్ని గౌరవించాలని, ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉండాలని పిలుపునిస్తాడు. చివరకు, చట్టపరమైన ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటిస్తుంది.

ఈ కథ అమరావతి రాజధాని ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతుల ఆవేదనను, వారి జీవన పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించింది. రాజకీయ నిర్ణయాల వల్ల రాజధాని పనులు నిలిచిపోయి, ఉపాధి కోల్పోయిన స్థానిక రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక ఇబ్బందులను చర్చించింది. తమ హక్కుల కోసం రైతులు చేపట్టిన మహా పాదయాత్ర, వారు అనుభవించిన అవమానాలు, వారి అచంచలమైన ఆత్మవిశ్వాసాన్ని రచయిత ఇందులో చిత్రించారు. కొండచిలువ వలె చుట్టుముట్టిన ఈ అనిశ్చితి నుండి విముక్తి పొంది, తమ ప్రాంతం మళ్ళీ అభివృద్ధి చెందాలని ఆశించే సామాన్యుల గాధ ఇది. ప్రకృతితో పాటు ప్రభుత్వ విధానాలు కూడా మనుషుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయనే చేదు నిజాన్ని ఈ కథ ప్రతిబింబించింది.

ఈ కథలో ప్రధానంగా చర్చించాల్సిన అంశం అమరావతి రైతుల ఆవేదనకు ప్రధాన కారణాలేంటి? అని. ఈ కోణంలో పరిశీలిస్తే, రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. అయితే ప్రభుత్వం మారడం,

'మూడు రాజధానుల' ప్రతిపాదన రావడంతో రాజధాని పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనివల్ల తమ త్యాగానికి ఫలితం దక్కలేదనేది రైతుల ప్రధాన ఆవేదన. అప్పటివరకూ ఎంతో ఆశతో ఎదురు చూసిన రాజధాని రైతులు ప్రభుత్వం మారడం వల్ల వాళ్ళ గుండెల్లో గునపాలు దిగినట్టే అవుతుంది. ఈలోగా ప్లాట్ల విలువ కోల్పోవడం మనోవేదనకు గురిచేస్తుంది. భూమికి ప్రతిఫలంగా రైతులకు నివాస, వాణిజ్య ప్లాట్లు కేటాయించారు. కానీ రాజధాని అభివృద్ధి ఆగిపోవడంతో ఆ ప్లాట్ల ధరలు పడిపోయాయి, కొనే నాథుడు లేక అవి ఎక్కటి ప్లాట్లు అక్కడే అలా మిగిలిపోతాయి. మంగలి రంగారావు వంటి వారు తమ ప్లాట్లు అమ్ముడుపోక ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. రాజధాని ప్రాంత రైతులు చెప్పుకోలేని బాధలను అనుభవించారనేది వాస్తవం. అంతే కాదు, అన్ని కులాలవారు ఈ సమస్యను ఎదుర్కొన్నారని కథా ముఖంగా తెలియవస్తుంది. ఈ విధంగా రచయిత భవిష్యత్ ఆశతో తమ భూములిచ్చి భంగపడ్డ రైతుల పక్షాన నిలబడ్డారని ఈ కథను పరిశీలిస్తే అర్థమవుతుంది.

రాజధాని మార్పు వల్ల ఉపాధి కోల్పోవడం అనేది ప్రధానంగా సంభవించిన సమస్య. రాజధాని పనుల వల్ల తమ బతుకులు బాగుపడతాయని రైతులు, కూలీలు ఆశపడ్డారు. కానీ పనులు ఆగిపోవడంతో కూలీలకు పని లేకుండా పోయింది. అటు సాగు చేయడానికి పొలం లేక, ఇటు రాజధాని పనులు లేక రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయారు. అద్దెలు వస్తాయని వాటితో ఇఎమఐ లు కట్టుకోవచ్చనే ఆలోచనతో కార్లు కొన్నవారు, ఇళ్లు కట్టినవారు అప్పుల పాలయ్యారు. చేసిన అప్పులు తీర్చలేక, అవమానభారం మోయలేక, మనోవేదన అనుభవించిన రైతులు ఎందరో ఉన్నారని ఈ కథలో తెల్పడాన్ని బట్టి రాజధాని రైతుల సమస్యలేంటో అర్థం చేసుకోవచ్చు. రాజధాని మార్పు ప్రస్తావన వల్ల వచ్చిన మరో సమస్య భూమి రూపురేఖలు మారిపోవడం. ఒకప్పుడు పచ్చని పంటలతో విలసిల్లిన పొలాలు పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలతో నిండిపోయాయి. తమ కళ్ళముందే భూమి శ్మశానంలా మారిపోవడం రైతులను కలచివేసింది. ఆనాటి రాజధాని రైతులు ఎదుర్కొన సమస్యను ఇలా ప్రస్తావిస్తూ రాసిన ఈ కథలో అన్నీ వాస్తవాంశాలే కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ నిరంకుశధోరణి అయిన మూడురాజధానులు గురించిన ప్రస్తావన చేసినపుడు విసిగిపోయిన రైతులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా మహిళలు రాజధాని పరిరక్షణ కోసం రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపడం తెలిసిందే. ఆ సమయంలో ఆడవారు అని కూడా చూడకుండా వారిపై దాడులు చేయడం, గాయపరచడం వంటి సంఘటనలు వారిని మరింత క్షోభకు గురిచేశాయని చిత్రించడంలో వాస్తవాన్ని గ్రహించవచ్చు.

**పోలీసుల దాడులు, అవమానాలు:**

రాజధాని పరిరక్షణ కోసం నిరసన తెలుపుతున్న మహిళలపై పోలీసులు లాఠీలతో దాడులు చేయడం, వారి బట్టలు చించి అవమానించడం వంటి సంఘటనలు వారిని తీవ్రంగా కలచివేసాయి. గ్రామాల్లో 144 సెక్షన్ పెట్టి, ఇనుప కంచెలు వేసి మనుషులు కలవకుండా నిర్బంధించడం వారి ఆవేదనకు మరో కారణం. అంతేకాకుండా తప్పుడు ప్రచారాలు విపరీతంగా చేస్తూ, ప్రజల్లో అనేక అనుమానాలకు తావిచ్చారు. అలాగే రాజధాని ప్రాంతం ముంపునకు గురవుతుందనే ప్రభుత్వవాదనలను వృద్ధరైతులు జీర్ణించుకోలేకపోయారు. గత 80 ఏళ్లలో కృష్ణా నది తమ ఊళ్లలోకి రాలేదని, కేవలం అభివృద్ధిని అడ్డుకోవడానికే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని, కృష్ణా నది వరద వస్తే ఈ ప్రాంతం మునిగిపోతుందనే

ప్రభుత్వ ప్రచారాలను 80 ఏళ్ల వయసున్న రామయ్య రెడ్డి వంటి వారు తప్పుబడుతున్నారు. అభివృద్ధిని అడ్డుకోవడానికే ఇటువంటి 'అభాండాలు' వేస్తున్నారని వారు భావిస్తున్నారు. ఇలా భావించడంలో కూడా సత్యం దాగి ఉంది.

ఈ కథలో చెప్పుకోదగ్గ మరో విశేషం, సామాజికంగా, వ్యక్తిగతంగా పతనమయ్యారని పేర్కొన్నారు. భూములు అమ్మి వచ్చిన డబ్బుతో కొందరు వ్యసనాలకు బానిసలై రోడ్డున పడటం, మరికొందరు భూమి పోయి, కూలీలుగా మారి పేదరికంలో మగ్గడం రైతుల్లో ఆవేదనకు కారణమైంది. మొత్తానికి, నమ్ముకున్న భూమి పోయి, ఆశించిన అభివృద్ధి రాక, ప్రభుత్వాల నిర్ణయాల మధ్య నలిగిపోతున్న రైతుల స్థితి ఈ కథలో హృదయవిదారకంగా చిత్రీకరించబడింది.

ఈ కథలో మరో ముఖ్యమైన అంశం రాజధాని పరిరక్షణ కోసం మహా పాదయాత్ర చేపట్టడం. చరిత్రలో నిలిచిపోయేలా అమరావతి పరిరక్షణ సమితి చేపట్టిన 'మహా పాదయాత్ర' రాజధాని ఉద్యమంలో అత్యంత కీలకమైన మార్పులను తీసుకురావడమే కాకుండా ఊహించని విజయాలను తీసుకువచ్చిందని ఈ కథలో చెప్పినదాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. అలాగే ఉద్యమానికి రాష్ట్రవ్యాప్త గుర్తింపు లభించడంలోనే సగం విజయం వరించేసింది. ఈ పాదయాత్ర ద్వారా రాజధాని ఉద్యమం కేవలం ఆ 29 గ్రామాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని, బలాన్ని సంతరించుకుంది. నవంబర్ 1, 2021న తుళ్ళూరులో ప్రారంభమైన ఈ యాత్రలో వేలాది మంది రైతులు, మహిళలు ఆకుపచ్చ కండువాలతో పాల్గొని తమ నిరసన గళమెత్తారు. ఉద్యమం ప్రారంభంలోనే ప్రజల్లో ఐక్యత, ఉత్సాహం పెరిగింది. "మూడు రాజధానులు వద్దు - అమరావతే ముద్దు, ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని"(సరళరేఖలు, పుట. 133) అనే నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దారిపొడవునా ప్రజలు యాత్రికులపై పూలవాన కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. కేవలం స్థానికులే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి, విదేశాల నుండి కూడా ప్రజలు వచ్చి ఈ యాత్రలో పాల్గొని సంఘీభావం తెలపడం విశేషం. ఈ ఉద్యమానికి రాజకీయ, సామాజిక మద్దతు కూడా లభించింది. 45 రోజుల పాటు దాదాపు 70 ప్రధాన గ్రామాల మీదుగా సాగిన ఈ యాత్ర తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగిసింది. ఈ సభలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనడం ద్వారా ఉద్యమానికి రాజకీయ ఏకాభిప్రాయం లభించింది.

ఈ పాదయాత్రకు లభించిన ఊహాతీత స్పందనను చూసి, చట్టపరమైన చిక్కుల దృష్ట్యా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించడానికి ఈ ఉద్యమ ప్రభావమే ప్రధాన కారణం. దీంతో రైతుల్లో మళ్ళీ నమ్మకం పెరిగింది. ఈ యాత్ర విజయవంతం కావడంతో అమరావతే ఏకైక రాజధానిగా నిలుస్తుందనే నమ్మకం, ఆశ రైతుల్లో బలపడింది. 'రైతులకు అన్యాయం చేసిన ఏ రాజ్యమూ బాగుపడలేదు' అనే నైతిక విజయం తమదేనన్న భావన వారిలో కలిగింది. మొత్తానికి, మహా పాదయాత్ర ద్వారా రాజధాని ఉద్యమం ఒక ప్రజా వెల్లువగా మారి, పాలకుల నిర్ణయాలను ప్రభావితం చేయగలిగే స్థాయికి చేరుకుంది అంటే వ్యవస్థలో రైతులకు ఉన్న మద్దతు ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. 'మహా పాదయాత్ర' అమరావతి రైతుల జీవితాల్లో, వారి పోరాటంలో ఒక నూతన ఉత్తేజాన్ని, ఆశను నింపింది అనడంలో ఏవిధమైన సందేహం లేదు.

ఈ కథలో 'కొండచిలువ' అనేది కేవలం ఒక పాము అనే అర్థంలో కాకుండా, అది అమరావతి ప్రాంతంలో నెలకొన్న దుస్థితికి, విధ్వంసానికి పాలకుల నిర్ణయాలకు ఒక శక్తివంతమైన ప్రతీకగా కనిపిస్తుంది. వసంత్ కుమారుడు రవి, అనంతారం కొండను చూసి దానికి చుట్టుకున్న అడవిని 'పెద్ద పైథాన్' అని పిలుస్తాడు. గతంలో పచ్చని పంట పొలాలుగా ఉన్న ఈ ప్రాంతం, ఇప్పుడు పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు తో నిండిపోయి, కొండను మింగేస్తున్న భయంకరమైన కొండచిలువలా కనిపిస్తోందని వసంత్ గ్రహిస్తాడు. ఒకప్పుడు రాజధాని నిర్మాణంతో కళకళలాడాల్సిన

ప్రాంతం, ఇప్పుడు పనులు ఆగిపోయి శ్మశానంలా మారింది. ఈ 'అడవి' లాంటి దుస్థితి రాజధాని కలలను, రైతుల ఆశలను చుట్టేసిన కొండచిలువలా వనరులలో వర్ణించబడింది. వసంత్ తన డైరీలో రాసుకున్నట్లు, "ప్రకృతే కాదు ప్రభుత్వాలు కూడా అప్పుడప్పుడు 'అడవుల్ని' నిర్మిస్తాయి" (సరళరేఖలు పుట. 134). అంటే, ప్రభుత్వాల తప్పుడు నిర్ణయాలు లేదా పాలసీలు పచ్చని ప్రాంతాలను ఎలా అడవుల్లా మారుస్తాయో, అభివృద్ధిని ఎలా మింగేస్తాయో చెప్పడానికి 'కొండచిలువ' కథ ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఈ కొండచిలువ కేవలం భూమి మీద పెరిగిన అడవి మాత్రమే కాదు, అది జనం మనస్సుల్లో విస్తరిస్తున్న ఆవేదనకు, అయోమయానికి కూడా ప్రతీకగా చెప్పుకోవచ్చు. కొండచిలువ కొండను చుట్టుకొని బుసలు కొడుతున్నట్లుగా అనిపించడం, ఆ ప్రాంతంలో నెలకొన్న భీతిని, అభద్రతా భావాన్ని ప్రతిబింబిస్తుంది.

కథ చివర్లో, ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తర్వాతి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా గౌరవించాలని రచయిత సూచించారు. రాజధాని మార్పు వంటి పెద్ద నిర్ణయాలు కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినవి కావు, అవి రాష్ట్ర అభివృద్ధికి, వేలాది మంది ప్రజల జీవితాలకు సంబంధించినవని రచయిత నొక్కి చెప్పారు. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతో రైతులు తమ అమూల్యమైన పంట భూములను రాజధాని కోసం ఇచ్చారు. వారి త్యాగాన్ని విస్మరించి, వారిని 'ఉట్టికీ స్వర్గానికి కాకుండా' చేయడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని కథ ద్వారా హెచ్చరించారు. రైతు కన్నీరు పెడితే ఆ రాజ్యం క్షేమంగా ఉండదని అంతర్లీనంగా హెచ్చరించారు. ప్రభుత్వాలు మొండిగా వ్యవహరించినప్పుడు, శాంతియుత పోరాటాలు, 'మహా పాదయాత్ర' వంటి ప్రజా వెల్లువలు పాలకులను తమ నిర్ణయాలను వెనక్కి తీసుకునేలా చేయగలవని ఈ కథ నిరూపించింది. అలాగే అభివృద్ధి పేరుతో సామాన్యుల జీవితాలు చితికిపోకూడదని రచయిత ఆకాంక్షించారు. అభివృద్ధి అనేది విధ్వంసకారిగా ఉండకూడదని, పాలకుల నిర్ణయాలు ప్రజల ఆశలను 'కొండచిలువ'లా మింగేయకూడదని రచయిత ఈ కథ ద్వారా సందేశాన్ని ఇచ్చారు.

**ముగింపు:**

పాపినేని శివశంకర్ రాసిన 'కొండచిలువ-1,2; కథలు పరిశీలన ద్వారా రచయిత దక్పథం, ఉద్దేశ్యం అన్నీ ఒక మంచి ప్రయోజనాన్ని ఆశించాయని తెలుస్తుంది. నేను చేసిన ఈ పరిశీలనలో వెలువడిన 2 కథలను సమగ్రంగా అధ్యయనం చేశాను. ఒక్కో కథ నవలిక వలే నిడివి కలిగి నవలలా సమాజానికి సందేశాన్నిచ్చింది. ఆయా కథల ద్వారా రచయిత ఏం కోరుకున్నారో, ఎలాంటి ఉద్దేశ్యాలను వెలువరించారో, ఏ విధమైన సందేశాలను, అవగాహనను కల్పించారో పరిశీలించాను. ఆయా అంశాలకు సంబంధించిన పూర్తి విషయాలు సమాజానికి సంబంధించినవేనని అర్థమవుతుంది. ముఖ్యంగా రాజధాని రైతల గురించిన ప్రస్తావన వాస్తవకోణంలో చేయడం రచయిత ధైర్యానికి నిదర్శనం. రాజధాని మార్పు వల్ల తలెత్తిన సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఒకే రాజధాని అని నమ్మి భూములిచ్చిన రైతలు ఎంతలా ఆవేదన చెందారో ఆయా కథల్లో వివరించారు. అటు వ్యవసాయం లేక ఇటు రాజధాని అభివద్ధి కాక వారు పడిన వేదన వర్ణించలేనిదని ఆయనే స్వయంగా చూసినట్లు వర్ణించడం చూస్తే రచయిత రైతుల పక్షపాతి అనిపించింది. అలాగే మహాపాద యాత్ర ప్రభుత్వాన్ని ఆలోచించేలా చేసి మూడు రాజధానుల మాటను వెనక్కి తీసుకున్నారని చెప్పడం చూస్తే, రచయిత రాజధాని రైతుల కోసం చాలా ఆలోచించారనిపించింది. ఏ రైతైనా భూమిని నమ్ముకునే బ్రతుకుతాడు. అలాంటి రైతుకు భూమికి అధిక ధరను చూపించి తరవాత ఆ భూమే ప్రయోజనం లేనిదని చెప్తే కలిగే ఆవేదన అంతా ఇంతా కాదు. ఆ రైతు ఆవేదనలన్నీ ఈ రెండు కథల్లో కళ్ళముందు ఆవిష్కరించి నాటి పరిస్థితులులను ఎంతో వాస్తవకోణంలో చిత్రించడం ఈ

కథల్లో ప్రధానాంశంగా చెప్పుకోవచ్చు. పాపినేని శివశంకర్ ఈ రెండు కథలు పూర్తిగా పరిశీలించాక, ఉద్దేశం మంచిదైతే ప్రయోజనం కూడా అటువంటిదే చేకూరగలదని ఆ కోవలోనే సాగాయని చెప్పొచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1. దక్షిణామూర్తి, పోరంకి. కథానిక - స్వరూప స్వభావాలు. హైదరాబాద్ - 1986.

2. ప్రతాప్ రెడ్డి, సురవరం. ఆంధ్రుల సాంఘికచరిత్ర. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ 2013.

3. వెంకటసుబ్బయ్య వల్లంపాటి: కథాశిల్పం (ద్వి.ము)- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2000.

4. శివశంకర్, పాపినేని. సరళరేఖలు (కథాసంపుటి). నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2022.

5. సిమ్మన్న, వెలమల. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు-దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, 2005

**Citation:** డా. పులపర్తి శ్రీనివాసరావు 2026. "పాపినేని శివశంకర్ కొండచిలువ కథలు: రాజధాని రైతుసమస్యలు". International Journal of Academic Research, 13(1): 134-142.

**Copyright:** ©2026 డా. పులపర్తి శ్రీనివాసరావు. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.